క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి భక్తులు సహకరించాలి

ఎమ్మెల్యే దొరబాబు



ఆలయ నిర్మాణానికి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దొరబాబు తదితరులు

కొత్తపల్లి: గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణానికి భక్తులు సహకరించాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని రమణక్కపేటలో నిర్మిస్తున్న శివాలయ ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలతో గ్రామాల్లో భక్తి భావాలు పెరుగుతాయన్నారు. భక్తుల ఆర్థికసాయంతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్

పిఠాపురం: వివిధ వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన నిర్వహించారు. వార్డుల్లో పారిశుధ్య సమస్యలు, విద్యుద్దీపాల మరమ్మతులను నిత్యం పర్యవేక్షిస్తుండాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. వైస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మ, పచ్చిమళ్ల జ్యోతి, కమిషనర్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



జి.రాగంపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు

పెద్దాపురం: మండలంలోని జి.రాగంపేట అంజి డెయిరీలో విజిలెన్స్ అధికారులు బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ జనార్దన్‌రెడ్డి, ఏఓ భార్గవ మహేష్‌ల ఆధ్వర్యంలో విజిలెన్స్ ఆహార తనిఖీ, తూనికలు, కొలతల శాఖల సిబ్బంది డెయిరీలో తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి ముద్ర లేని 15 కేజీల నెయ్యి, పామాయిల్ డబ్బాలపై ధరలు లేకపోవడం, కొలత తక్కువ ఉన్నట్లు గుర్తించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. డెయిరీ నిర్వాహకులపై మూడు కేసులు నమోదు శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం సేకరించినట్లు వారు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కాకినాడ ఆహార తనిఖీ అధికారి సుబ్బారావు, పెద్దాపురం తూనికలు, కొలతల శాఖాధికారి మోహన్ తదితరులున్నారు.

యూటీఎఫ్ నేతకు నివాళులు

పెద్దాపురం: యూటీఎఫ్ నాయకుడు లక్ష్మీనారాయణ వర్ధంతిని స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ ముఖ్య అతిథిగా హాజరై ఆయనకు నివాళులు అర్పించారు. యూటీఎఫ్ నాయకుడు కెనడీ అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మీనారాయణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

లక్ష పసుపు కొమ్ముల నోము



పసుపు కొమ్ముల నోము నిర్వహిస్తున్న పండితులు

పిఠాపురం: గొల్లప్రోలులో ఉన్న అచ్యుతకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం వ్యాపారి గొల్లపూడి శ్రీరామ చంద్రమూర్తి, జయలక్ష్మి దంపతులు గరిసె ధాన్యం, లక్ష పసుపు కొమ్ముల నోమును నిర్వహించారు. కొల్లూరి పవన్‌శర్మ పూజా కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం ముత్తయిదువులకు పసుపు కొమ్ములను పంపిణీ చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: స్థానిక డీ1 సెక్షన్ పరిధిలోని ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ బుధవారం తెలిపారు. డీ1 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ ఆనంద భారతి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సినిమా రోడ్డు, పోలీసు లైన్ వీధి, బ్యాంకు పేట, గుజ్జువారి వీధి, చిన వీధి, రాజాక్ అపార్టుమెంట్ తదితర ప్రాంతాలకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

- ఎన్నో ఏళ్ల కల నెరవేరిందిలా..
- హైస్కూళ్ల అప్‌గ్రేడ్‌తో ఫలించిన సంకల్పం
- పెద్దాపురం మండలంలో రెండో జూనియర్ కళాశాల ఏర్పాటు
- విద్యార్థుల తల్లిదండ్రుల హర్షాతిరేకాలు



జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన కాండ్రకోట ఉన్నత పాఠశాల

పెద్దాపురం: ఏటిపట్టు గ్రామాల్లో విద్యాభివృద్ధికి మార్గం సుగమమైంది. డ్రాపౌట్ల నివారణ, బాలికా విద్యకు ప్రోత్సాహమిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మండలానికొక బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలన్న సంకల్పం ఫలించింది. ఏటిపట్టుకు ప్రధాన కేంద్రమైన చంద్రమాంపల్లి హైస్కూలును గత ఏడాది అప్‌గ్రేడ్ చేసి బాలికల జూనియర్ కళాశాల నిర్వహించేందుకు గత ఏడాది అడ్మిషన్లు ప్రారంభించారు.

ఇది ఉలా ఉండగా మండలంలోని కాండ్రకోట జిల్లా పరిషత్ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ మరో జూనియర్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ఏడాది అప్‌గ్రేడ్ అయిన చంద్రమాంపల్లి పాఠశాల పరిధిలోని పులిమేరు, దివిలి, తాటిపర్తి, తిరుపతి, గ్రామాలతో పాటు పిఠాపురం మండలం విరవ, విరవాడ, కిర్లంపూడి మండలం రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల విద్యార్థినులకు పూర్తి ఉన్నత విద్యను అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం అప్‌గ్రేడ్ అయిన కాండ్రకోట జూనియర్ కళాశాల పరిధిలో మర్లావ, కాండ్రకోట, ఉలిమేశ్వరం, సిరివాడ, గుడివాడ, కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల పరిధిలో విద్యార్థులకు ఈ కళాశాల చేరువలో ఉంటుంది. దీంతో ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఓ వరంలా..

ఏటిపట్టు గ్రామాలైన ఆయా గ్రామాల విద్యార్థులకు కల్పించిన ఈ అవకాశం వారికి ఓ వరమనే చెప్పుకోవాలి. ఉన్నత విద్య కోసం ప్రభుత్వ కళాశాలలకు వెళ్లాలంటే సామర్లకోట, పెద్దాపురం, కాకినాడకు వెళ్లాల్సి వచ్చేది. ఇకపై ఈ ప్రాంత విద్యార్థులకు ఇక్కట్లు తగ్గినట్టే.

ఆరంభం ఇలా..

అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలో బాల బాలికలకు కేవలం 120 మందికి మాత్రమే అవకాశం ఉంది. తొలుత ఆయా కో–ఎడ్యుకేషన్ కళాశాలలో మూడు గ్రూపులను మాత్రమే నిర్వహించేందుకు అనుమతి లభించడంతో ఎంపీసీ గ్రూపులో 40 మంది, బైపీసీ గ్రూపులో 40 మంది సీఈసీ 40 మందికి మాత్రమే అడ్మిషన్లు ఇవ్వనున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో పాసైన ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అందుబాటులో ఉండడంతో అడ్మిషన్లు వేగవంతం చేసేందుకు చర్యలు చేపడతామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



బాల, బాలికలు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో పలు జెడ్పీ హైస్కూళ్లను బాలికల జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. దీనిలో భాగంగా కాండ్రకోట జెడ్పీ హైస్కూల్‌ను కో–ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ప్రాంత విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలి.

–ఎంఎస్సీ మూర్తి, హైస్కూల్ హెచ్ఎం, కాండ్రకోట

విద్యార్థులకు మంచి అవకాశం



కాండ్రకోటలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో పెద్దాపురం మండల పరిధిలోని విద్యార్థినులకు ఉన్నత విద్యను అందించేందు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–గవరసాని సూరిబాబు, జెడ్పీటీసీ, కాండ్రకోట, పెద్దాపురం మండలం

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

- ఈఆర్వో జేఎస్ రామారావు
- శిక్షణకు హాజరు కాని ఐదుగురు బీఎల్‌ఓలకు షోకాజ్‌లు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో రామారావు

పెద్దాపురం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిబ్బంది ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేది లేదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో బీఎల్‌వోలతో ఎన్నికల ప్రక్రియపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆర్డీవో జేఎస్ రామారావు మాట్లాడుతూ ఈసీ ఆదేశాల మేరకు సిబ్బంది శిక్షణ తరగతుల ద్వారా ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగిస్తారన్నారు. బీఎల్‌వోలు విధులను సక్రమంగా నిర్వర్తించాలని, కమిషన్ నిబంధనలపై మరింత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నిలకు సంబంధించి పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, టాయిలెట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓటు వేసే విధానంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ గురవుతున్నాయన్న ఆపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. అవగాహన లేమి వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ చర్యలు చేపట్టిందన్నారు. రెండు రోజుల శిక్షణకు హాజరు కాకుండా ఎన్నికల విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురు బీఎల్‌ఓలకు ఆర్డీఓ రామారావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం ఈవీఎంల పనితీరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై మాస్టర్ ట్రైనర్లు జాన్ కెనడీ, సీతా రామారావు, శ్రీనివాస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, బీఎల్‌ఓలతో పాటు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తుల పరిష్కారానికి కృషి

ఈఆర్వో రామారావు



వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లయిమ్‌ల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో బుధవారం ఎన్నికల ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామారావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై మరింత అవగాహన అవసరమన్నారు. ఇప్పటికి ఫారం 6కు సంబంధించి 155, 7కు సంబంధించి 45, 8కు సంబంధించి 101 దరఖాస్తులు అందాయన్నారు. ఆయా క్లయిమ్‌ల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్డీఓ అన్నారు. అనంతరం ఓటర్ల జాబితా విధానం, ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు,(వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ) నీలపాల సూరిబాబు (సీపీఎం)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

విలియం హోకు నివాళులు



విలియం హో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దర్జీలు

పెద్దాపురం: దర్జీల గురువు విలియమ్స్ హో జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో బుధవారం ఘనంగా దర్జీల దినోత్సవాన్ని నిర్వహించారు. విలియం హో చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మన ఇల్లు వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో దర్జీల సంఘం అధ్యక్షుడు గుడివాడ కనకరత్నం, అల్లాడ రాఘవ, అల్లక వీరభద్రరావు, జిలగం సత్తిబాబు, జట్టు రవి, పెదిరెడ్ల రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

కొత్తపల్లి: పిఠాపురం నియోజకవర్గంలో బుధవారం ప్రపంచ టైలర్స్ డేను ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టైలరింగ్ మెషీన్ సృష్టికర్త విలియం హోం చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్లను సత్కరించారు. టైలర్లకు కుట్టుమెషీన్ల కొనుగోలుకు, షాపుల అభివృద్ధికి రుణాలను మంజూరు చేయాలని, తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు.

అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు
- అంబేడ్కర్ విగ్రహం పునః ప్రతిష్ఠ



అంబేడ్కర్ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: యువత అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి బుధవారం ఎంపీతో పాటు, ఎమ్మెల్యే పెండెం దొరబాబుల ముఖ్యఅతిథులుగా హాజరై, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ ఈరోజు దేశానికే కాదు, అంబేడ్కరంటే ప్రపంచ దేశాలకు కూడా ఎనలేని గౌరవమన్నారు. అంబేడ్కర్ జీవితమే ఆదర్శప్రాయమన్నారు. రాజ్యాంగ నిర్మాణం ద్వారా బడుగు, బలహీన వర్గాల వారు ఇబ్బందులు లేకుండా ఉన్నారంటే ఆయన చలవేనన్నారు. దేశానికి దిశానిర్దేశం చేసిన వ్యక్తిగా ఖ్యాతి గాంచిన ఆయన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, నాయకులు గవర నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పొన్నగంటి రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠలు



తిమ్మాపురంలో వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్ తదితరులు



పండూరు శివాలయం శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులతో కన్నబాబు, సునీల్

- తిమ్మాపురం, పండూరు గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి
- పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల, కాకినాడ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సునీల్

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం, పండూరు గ్రామాలలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తిమ్మాపురంలో ప్రాచీనమైన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం పునర్నిర్మించడంతో బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షణలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ జరిగాయి. సీజీఎఫ్ గ్రాంట్ రూ.45 లక్షలు, మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ రూ.5 లక్షలు కలిపి రూ.50 లక్షలు, భక్తులు, గ్రామస్తులు సేకరించి విరాళాలు కలిపి సుమారు రూ.1.20 కోట్లతో నిర్మించిన విష్ణు ఆలయాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటరు చలమలశెట్టి సునీల్, రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, దేవదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం స్వీకరించారు.

పండూరు గ్రామంలో గౌరీ సమేత ఉమా కేదారేశ్వర స్వామి ఆలయం (శివాలయం) ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కన్నబాబు, సునీల్ పాల్గొన్నారు. కేదారేశ్వరస్వామిని దర్శించుకుని, శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో 125కు పైగా ఆలయాల నిర్మాణం, పునర్నిర్మాణం చేపట్టామన్నారు. ఆ భగవంతుడు ఆశీస్సులు సీఎం జగన్, తనపై, పార్లమెంట్ కో ఆర్డినేటరు సునీల్‌పై ఉండాలని కోరుకుంటున్నానన్నారు. శివాలయం నిర్మాణానికి సునీల్ సొంత నిధులు రూ.10 లక్షలు విరాళంగా అందించారన్నారు. చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ తిమ్మాపురం, పండూరు గ్రామాలలో ఆలయాలు చక్కగా నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు, నందిపాటి ధర్మరాజు, ఆదినారాయణ, నండూరు రాంబాబు, బావిశెట్టి వెంకటేశ్వరరావు, నందిపాటి పల్లయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే బదిలీ చేయించుకోండి

- అధికారులపై కౌన్సిల్ సభ్యుల ధ్వజం
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ అరుణ

సామర్లకోట: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులు చెబుతున్నా అధికారుల నిర్లక్ష్యం చేయడం సరికాదని, పద్ధతి మార్చుకోకుంటే బదిలీపై వెళ్లిపోవాలని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పిట్టా సత్యనారాయణ, పాగా సురేష్ తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, డ్రైయిన్ల నిర్మాణం వంటి ప్రజా సమస్యలను పరిష్కరించాలని గత సమావేశాల్లో సూచించినా నేటికీ పట్టించుకోకపోవడం సరికాదని మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ మాట్లాడుతూ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, రెడ్నం సునీత మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చించేందుకు జీరో అవర్‌ను కొనసాగించాలని పట్టుబట్టి మాట్లాడుతూ ఎన్నిసార్లు చెప్పినా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. టిడ్కో ఇళ్ల రుణాల మంజూరులో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం అజెండాలో 1, 7, 20 అంశాలను వాయిదా వేయాలన్న సభ్యుల కోరిక మేరకు మూడు అంశాలను వాయిదా వేస్తూ సమావేశంలో తీర్మానించారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కో–ఆప్షన్ సభ్యుడిగా నియమించిన కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిల్‌కు తన వంతు సహాయ, సహకారాలందిస్తానని, కౌన్సిల్ సభ్యులు ప్రతీ ఒక్కరూ తనకు సహకరించాలని కోరారు. అనంతరం పలు అంశాలపై కౌన్సిల్‌లో చర్చించారు. ఈ కార్యక్రమంలో మరో కో–ఆప్షన్ సభ్యులు నండూరి కళ్యాణ్, కౌన్సిలర్లు స్వయంవరపు వీరభద్రరావు, వీరభద్రరావు, చల్లపల్లి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

కరప: యువత ఓటరుగా నమోదుచేసుకోవాలని, ఓటర్లందరూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ అన్నారు. అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలన్నారు. పోటీచేసే అభ్యర్థులలో సమర్థులు, నిజమైన ప్రజాసేవ చేసేవారిని, పరిపాలనాదక్షులను, నిజాయతీపరులను, ప్రజల ఆస్తులను పరిరక్షించే వారిని సరిచూసుకుని ఎన్నుకోవాలని ఎంఈఓలు కృష్ణవేణి, సత్యనారాయణలు సూచించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం పి.వెంకటశివగిరి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అడ్డాల రమేష్, సీఆర్పీ పి.రాజు, బి.సుజాత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



భవిత సెంటర్‌లో ఎంఆర్ కిట్‌ను అందజేస్తున్న శివజ్యోతి

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాల హెచ్ఎం శివజ్యోతి అన్నారు. స్థానిక భవిత సెంటర్ విభిన్న ప్రతిభావంతులకు నెల్లూరు ఎన్ఐఎంహెచ్ ద్వారా మంజూరైన ఎంఆర్ కిట్లను బుధవారం ఆమె అందజేశారు. ఐఆర్‌టి ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివజ్యోతి మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు విద్యాశాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభా వంతులైన విద్యార్థులకు మెరుగైన వైద్యం, విద్య సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బి.ఆనందరావు, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలని ధర్నా

పెద్దాపురం: పెరిగిన నిత్యావసర ధరల దృష్ట్యా ఎగుమతి కూలీ రేట్లు పెంచాలంటూ బుధవారం సామర్లకోట బేవరేజ్ డిపో వద్ద హమాలీలు ధర్నా చేశారు. బేవరేజ్ హమాలీస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, అప్పలరాజుల ఆధ్వర్యంలో నినాదాలు చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో వద్ద పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఎగుమతి కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొండలరావు, హమాలీలు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు ఉషశ్రీకి డాక్టరేట్



ఉషశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుభాషిణి

పిఠాపురం: పశువుల్లో వచ్చే వ్యాధికారక క్రిములకు సంబంధించిన అంశంపై పరిశోధన చేసిన పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ అధ్యాపకురాలు కె.ఉషశ్రీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. మంగళవారం డాక్టరేట్‌ను అందుకున్న ఉషశ్రీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి బుధవారం అభినందించారు. పలువురు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయిని కుమారి

పెద్దాపురం: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు రాజు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో సీవి రామన్ చిత్రపటానికి ఘనంగా నివాళుర్పించారు. సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు ఏఎల్‌వి కుమారి మాట్లాడుతూ రామన్ సేవలను వివరించారు. పెద్దాపురం మహారాణి కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ సత్యన్నారాయణమూర్తి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు.

374 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం



లింగంపర్తిలో ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో 374 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపట్టడమే ఈ ఏడాది లక్ష్యంగా రైతుల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల పరిధిలోని అధికారులు, సిబ్బందితో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు కోసం ఎకరాకు రైతుకు నాలుగేళ్ల కాలంలో రూ.69,599 సబ్సిడీ లభిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభం ఆర్జించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లిగంపర్తి, ఏలేశ్వరంల్లోని ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ ఆయిల్ ఫీడ్ డివిజనల్ అధికారి జగ్దేశ్వర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి ఏ.శ్రీవల్లి, ఇతర అధికారులు పాల్గొన్నారు.